క్లుప్తంగా

మొక్కల పెంపకంపై దృష్టి

మల్దకల్: హరితహారం నాటికి గ్రామాలలోని నర్సరీలలో పెంచుతున్న మొక్కల పెంపకంపై నర్సరీ నిర్వాహకులు దృష్టి సారించాలని సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి సరిత సూచించారు. ఆదివారం మండలంలోని మంగంపేటలో ఏర్పాటు చేసిన నర్సరీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోసి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వ్యవసాయ పరికరాలు

రాజోళి: రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు మేలు చేసేందుకు తక్కువ ధరలో టార్పాలిన్లు, వేపనూనె, వేప పిండి ఇతర వ్యవసాయ సంబంధిత సామాగ్రి అందుబాటులో ఉన్నాయని వాటిని మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. సంఘంలో రైతులు సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు.

2న అవతరణ దినోత్సవం

ధరూరు: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించే పతాకా విష్కరణకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు జెండా కార్యక్రమం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, మండల స్థాయి నాయకులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, యువకులు హాజరు కావాలని కోరారు.

పాగుంటలో తాగునీటి ఎద్దడి

కేటీదొడ్డి: మండలంలోని పాగుంటలో తాగునీరు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో తాగునీరు అందక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీరసావర్కర్ సేవలు ఆదర్శం



అయిజ: వీరసావర్కర్ సేవలు ఆదర్శమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దామోదర్ వీరసావర్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, జానకి రాముడు, వెంకటేష్, ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన బోయ రాముడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు కొండేరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమనాద్రి సూచన మేరకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, సురేష్, తేజ, ముని, వెంకటన్న, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఆత్మకూర్: చిట్టెం రామన్న యువసేన ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక బీసీ కాలనీలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, వార్డు మాజీ సభ్యుడు గద్దమీది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 62 జట్లు తలపడ్డారు. మొదటి బహుమతి సాధించిన ఆత్మకూర్ అబీ ఫ్రెండ్స్ జట్టుకు రూ.50వేలు నగదు, షీల్డు, రెండో బహుమతి సాధించిన మక్తల్ జట్టుకు రూ.25వేలు నగదు, షీల్డును చైర్‌పర్సన్ గాయత్రి అందజేశారు. ఆటలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు వేర్వేరుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు హరీష్, రఘు, కమాల్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు అయ్యేనా?

- ఏటా పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



అయిజలో కాలి పోతున్న ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

అయిజ: మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రూ. లక్షల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం దక్కడం లేదు. ఏదైన ప్రమాదం జరిగితే మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం నుంచి ఫైరింజన్ రావాల్సి ఉంటుంది. అయిజ నగర పంచాయతీకి అగ్నిమాపక కేంద్రం 30 కి.మీ. దూరంలో ఉంది. సకాలంలో ఫైర్‌ఇంజన్ సంఘటనా స్థలానికి రాలేక పోతోంది. మండలంలోని కొన్ని



భూంపురంలో మంటల్లో కాలిపోతున్న గడ్డివాములు (ఫైల్)

గ్రామాలు అగ్ని మాపక కేంద్రానికి 50 కి.మీ. దూరంలో ఉన్నాయి. ఒకే సారి రెండు మూడు గ్రామాల్లో ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగి ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో ఫైర్ స్టేషన్ ఉండడంతో మంటలు చెలరేగిన సంఘటనా స్థలంలో ఫైరింజన్ మంటలను ఆర్పుతుండడంతో ఇంకో ప్రదేశంలో మంటలను ఆర్పేందుకు వీలుకాకపోవడంతో చేతులెత్తేస్తున్నారు. ఫైరింజన్ వచ్చేసరికి గుడిసెలు, గడ్డివాములు అప్పటికే దగ్ధమవుతున్నాయి.

ప్రమాదాలు ఇలా..

పట్టణంలోని గుర్రంతోట వీధిలో 2016లో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశుపాక పూర్తిగా దగ్ధమైంది. అందులో కట్టేసిన రెండు ఎద్దులు సజీవ దహనం అయ్యాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. 2017లో ఉప్పల గ్రామ శివారులోని 6 ఎకరాల చెరుకుతోట పూర్తిగా కాలింది. రైతు సుమారు రూ. 6 లక్షల వరకు నష్టపోయాడు. అదే సంవత్సరం అయిజ పట్టణంలోని ఎస్సీ కాలనీలో గడ్డివాములకు నిప్పంటుకొని సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగింది. అయిజ పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ వలన మంటలు చెలరేగి రెండు దుకాణాలు కాలిపోగా సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లింది. 2019లో భూంపురంలో గడ్డివాములు అంటుకొని రూ. 3 లక్షల వరకు నష్ట పోయారు. 2020 సంవత్సరం బైనిపల్లిలో 12 గడ్డివాములు నిప్పంటుకొని సుమారు రూ. 2 లక్షలు, 2022లో అయిజ పట్టణ సమీపంలోని రెండు చొప్పదొడ్లు కాలిపోయి సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది.

పటించుకోవడం లేదు..



అయిజలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులతో ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదు. అయిజ 2012లో నగరపంచాయతీగా, 2018లో మునిసిపాలిటీగా మారింది. అయినా ఇంత వరకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కాలేదు. అనేక సార్లు అగ్ని ప్రమాదాలు జరిగి రూ. లక్షల ఆస్తినష్టం నష్టపోతున్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రైతు మహదేవ్, అయిజ

సకాలంలో ఫైరింజన్ రాలేక..



మండలంలోని వివిధ గ్రామాలు అగ్ని మాపక కేంద్రానికి 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినప్పుడు ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకోవడానికి సుమారు గంట సమయం పడుతోంది. అంతలోపు జరుగాల్సిన నష్టం జరిగిపోతోంది. గతం సంవత్సరం ఆరు ఎకరాల చెరుకుతోట దగ్ధమైంది. ఫైరింజన్ ఆలస్యంగా రావడంతో రూ. 6 లక్షల ఆస్తి నష్టం జరిగింది.

– రైతు నాగార్జునరెడ్డి, ఉప్పల

ఉన్నతాధికారులకు వివరిస్తాం..



ప్రతి సంవత్సరం అగ్ని ప్రమాదాలు జరుగుతున్నది వాస్తవమే. మండల కేంద్రానికి అగ్నిమాపక కేంద్రం 30 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఫైర్ ఇంజిన్ వచ్చే సరికి నష్టం జరుగుతోంది. మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే చాలావరకు అగ్నిప్రమాదాలను అరికట్టవచ్చు. కొంత మేర అయిన ఆస్తి నష్టాలను తగ్గించవచ్చు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– లక్ష్మి, తహసీల్దార్, అయిజ

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. దివంగత ఉత్తనూరు తిరుమలరెడ్డి 59వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండంలోని సంకాపురంలో బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత నుంచి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు మొత్తం 640 యూనిట్లు రక్తదానం సేకరించారు. దాతలకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ప్రసిడెంట్ సంకాపురం రాముడు, సర్పంచ్ సుజాత, బీఆర్ఎస్ నాయకులు అజయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ప్రసిడెంట్ తాహేర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ఆదివారం దివంగత తిరుమలరెడ్డి 59వ జయంతి సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటి చైర్‌పర్సన్ సువర్ణమ్మ, సర్పంచ్ సుదర్శనమ్మ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, గట్టు ఎంపీపీ అజయ్, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, పాల్గొన్నారు.

ఆర్డీఎస్ కాల్వకు మరమ్మతు చేపట్టాలి



డీ 31 ఏ కాలువ కూలిన రక్షణగోడ

మానవపాడు: ఆర్డీఎస్ కాల్వ డీ–29, డీ–30, డీ–31కు సంబంధించిన కాల్వ పూడికతీత పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా కాల్వలపై నిర్మించిన మినీ వంతెనకు రక్షణగోడలు కూలాయని పేర్కొన్నారు. రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్డీఎస్‌కు కాల్వకు మరమ్మతు, మినీ వంతెనకు రక్షణగోడలను నిర్మించాలని మండల రైతులు కోరుతున్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



గట్టు బస్టాండ్‌లో టిప్పటర్‌ను అడ్డుకున్న దుకాణాదారులు

గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణదారులు ఆదివారం టిప్పర్లను అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణ పనుల కోసం ఉదయం నుంచి రాత్రి వరకు కంకర, డస్ట్‌ల లోడుతో వెళ్తున్న టిప్పర్ల కారణంగా దుమ్ము, ధూళితో రోగాల బారిన పడుతున్నామని దుకాణదారులు వాపోయారు. దుమ్ము లేవకుండా నీటిని చల్లాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కారణంగా బస్టాండ్ ఆవరణలోని దుకాణాల ముందు నిలబడే పరిస్థితి లేదని, ప్రయాణికులు బస్టాండ్ వైపు రావడం గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో దుమ్ము లేవకుండా ఉదయం, సాయంత్రం ట్యాంకర్ ద్వారా నీటిని చల్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

గట్టు: మండలంలోని గంగిమాన్‌దొడ్డిలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటుగా సాంద్ర సింధు వేదం గురించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాగుంట గ్రామానికి చెందిన నారాయణ, రమేష్, తెల్లవారు జామున బూడిదపాడు వాగు నుంచి పాగుంట గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడు. అందుకున్న సమాచారం మేరకు పాగుంట శివారులో ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. యాజమానిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాదాసి కురువుల సంఘాలు అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంను కలిశారు. నియోజక వర్గంలోని మాదాసి కురవ సంఘం సభ్యులతో పాటు రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జల్లాపురం వెంకటేశ్వర్లు కలిసి గొర్రెల పంపిణీకి సంబంధించిన అన్ని యూనిట్లను ఒకేసారి పంపిణీ చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో మాదాసి కురువ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సురవరం ప్రతాప్ రెడ్డికి ఘన నివాళి



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులోని సురవరం ప్రతాప్ రెడ్డి 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన విగ్రహానికి సర్పంచ్ సురవరం లోకేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళుర్పించారు. ప్రతాప్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, గ్రామస్తులు వెంకట్రామిరెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మణ్ గౌడు, కురుమన్న, అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల గడ్డ గద్వాల

గద్వాల అర్బన్: ప్రజా పోరాటాల గడ్డ గద్వాల అని వివిధ సంఘాలు, పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్ పాషా ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో పౌర ప్రజాస్వామిక హక్కులకు కనీస గౌరవం లేని పాలన కొనసాగుతుందన్నారు. పాలకుల ఆరాచాకాలు పెట్రేగిపోతున్నాయన్నారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు అతికూర్ రహ్మాన్, ఆంజనేయులు, వెంకటస్వామి, సత్యరెడ్డి, దేవరాజు, రహమతుల్లా, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలావాసుడికి వెండి వితరణ



మల్దకల్ ఆలయ చైర్మన్‌కు వెండిని వితరణ చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామికి అయిజకు చెందిన నాగేంద్రం, సుధాకర్‌రావు, అరుణబాయి దంపతులు 250 గ్రాముల వెండిని, నందికొట్కూర్‌కు చెందిన రవికుమార్, త్రివేణి దంపతులు 200 గ్రాముల వెండిని ఆదివారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతల సహాయ సహకారంతో స్వామి వారికి వెండితొడుగును అలంకరణ కోసం వెండిని సేకరిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, నాగరాజు శర్మ, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మహబూబ్ నగర్‌జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గద్వాల రెడ్ క్రాస్ రమేష్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవినీతి పాలనను సాగనంపుదాం



ఇందువాసిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గట్టు: రాష్ట్రం నుంచి బీఆర్ఎస్ అవినీతి పాలనను సాగనంపుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఇందువాసిలో బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలే కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఐదు నెలలు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని, గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలని కోరారు. నెట్టెంపాడు ప్రాజెక్టును మాజీ మంత్రి డీకే అరుణ తీసుకొచ్చారని, అయితే 9 ఏళ్ల పాలనలో కేసీఆర్ సర్కారు కాలువలో మొలచిన జమ్ము, ముండ్ల కంపలను తొలగించలేక పోయిందని ఎద్దేవ చేశారు. సీఎం కేసీఆర్ ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, ఉపాధ్యక్షుడు అహ్మద్ అలీ, నాయకులు రాజప్ప, తిమ్మప్ప, నాగరాజు, రామకృష్ణ, రమేష్, రవి, రవిగౌడు, గోవిందు, రాముడు, అంజన్న, సంజీవ, నర్సన్న, హరిచంద్ర, చిన్న స్వామి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చొక్కంబావిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

గద్వాల రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 27వ వార్డులో ఆయన పర్యటించారు. ప్రధాన మురుగు కాలువలను సిబ్బందితో శుభ్రం చేయించారు. అదేవిధంగా స్థానిక చొక్కంబావి పరిసర ప్రాంతాల్లో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత చర్యలు పాటించాలన్నారు. అదేవిధంగా నలసోమనాద్రి కాలంలో నిర్మించిన చొక్కంబావిలో పేరుకున్న సిల్టును తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మన్సూర్, వార్డు జవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు వేణుగోపాల్, నారేందర్‌రెడ్డి, వేణుగోపాల్, ఈశ్వర్‌రెడ్డి, పాపయ్యలకు పూల మాల శాలువాతో సన్మానించారు. మృతి చెందిన ఉపాధ్యాయులు కేశవయ్య, మురళీధర్, విద్యార్థులు రామాంజనేయులు, శ్రీనులకు నివాళులర్పించారు. అనంతరం ఒకరికికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత మిత్రులను కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవి, కిశోర్, నరసింహ, నాగేశ్వర్‌రావు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివంగత ఎన్టీఆర్ జయంతి



చెనుగోనిపల్లిలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గద్వాల అర్బన్: టీడీపీ వ్యవస్థాపకుడు అధ్యక్షుడు, దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఆదివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. గద్వాల మండలంలోని చెనుగోనిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇస్మాయిల్, పుల్లయ్య గౌడ్, వెంకటన్న, శివన్న, సురేష్ తదితరులు ఉన్నారు.

అయిజ: దివంగత ఎన్టీఆర్ శత జయంతిని పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, శ్రీధర్, వీరన్న గౌడ్, శ్రీను, కృష్ణారెడ్డి, భీమన్న, శేఖర్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను పట్టణంలో రాష్ట్ర నాయకుడు పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముజీబ్, చంద్రశేఖర నాయుడు, భాస్కర్, విశ్వం, వలీబాషా, నాగరాజు, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



నందిన్నె సమావేశంలో వీరశైవ లింగాయత్ సభ్యులు



ధరూరులో వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న గట్టు సురేష్

కేటీదొడ్డి: వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే వీరశైవ లింగాయత్ మహార్యాలీకి మండలం నుంచి లింగాయత్‌లు అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర కార్యదర్శి బీజాపూర్ ఆనంద్ కోరారు. ఆదివారం మండలంలోని పాతపాలెం, గంగన్‌పల్లి, ఈర్లబండ, చింతలకుంట, నందిన్నె, కుచినెర్ల, చింతలకుంటలో ఏర్పాటు చేసి సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యదర్శి ఆకుల బసవేశ్వర్, యువజన నాయకులు నాగేష్, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్ మహార్యాలీని వియవంతం చేయాలని వీఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు గట్టు సురేష్, ప్రధాన కార్యదర్శి ఆకుల బసవరాజు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని డీఆర్ శ్రీధర్ నివాసంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, మల్లేశ్, ఆకుల నాగేశ్వర్, శెట్టి అమరేష్, వన్నువాడ రమేష్, రాజు, తిరుమలేష్, వీరభద్రప్ప, సూరి, నాగశివుడు తదితరులు పాల్గొన్నారు.